# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MAY 2007

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00గం॥లకు,సాయంత్రం
5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!
మీ బంధు మిత్రులకు వినిపించండి !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | మే 2007 | సంచిక 10

## సజీవుడైన దేవుడు

(The God That lives)

బైబిలు సూచించు దేవుడు, ఆయనే నిజ దేవుడని మనము తెలిసికొనవలెనని కోరుచున్నాడు. "ఊరకుండుడి, నేనే దేవుడనని తెలిసికొనుడి. అన్య జనులలో నేను మహోన్నతుడనగుదును. భూమి మీద నేను మహోన్నతుడనగుదును" అని ఆయన సెలవిచ్చుచున్నాడు (కీర్తన 46:10). "అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" అని యేసు ప్రభువు పలికెను (యోహా 17:3). ఆ నిత్య సత్య దేవుని గూర్చి మనము తెలిసికొను నిమిత్తము దేవుడే తన్ను తాను ప్రకృతిలోను, బైబిలు గ్రంధమందును, యేసుక్రీస్తులోను బయలు పరచుకొనెను. బైబిలు గ్రంధము దేవుని వాక్యము గనుక ఆ గ్రంధమందు మనకగుపడు దైవ లక్షణములను బట్టి దేవుని మనము ఎరుగగలము.

బైబిలు సూచించు దేవుడు సజీవుడైన

దేవుడై యున్నాడు. ఐగుప్తు దేశములో బానిసలుగా యున్న ఇశ్రాయేలీయులను విడిపించుటకు దేవుడు మోషేను వారి యొద్దకు పంపుచూ "నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన - ఉండుననువాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను" (నిర్గమ 3:14). నేను ఉన్నవాడను అని దేవుడు తన్ను తాను చెప్పుకొనెను. అనగా ఆయన ఒకప్పుడు ఉండి ఇప్పుడు లేకపోయేవాడు కాదు. లేదా ఇప్పుడు ఉండి మరొకప్పుడు లేకుండాపోయేవాడు కాదు గాని ఆయన ఎల్లప్పుడు ఉండువాడై యున్నాడు. దీనివలన ఆయన సజీవుడై యుండువాడని మనము గ్రహించుకొనగలము.

జీవముగల దేవుడు అను మాట మనకు బైబిలునందు తరచు కన్పించుచూ యుండును. దానియేలు జీవముగల దేవుని సేవించువాడని చెప్పగానే, జీవములేని మృతమైయున్న దేవుండ్లను రాతితోను, చెక్కతోను, లోహముతోను, చేసికొని సేవించువారికి ఆయన వేరై యున్నాడని గ్రహించుకొన గలము. దానియేలు సేవించు దేవుడు జీవము గల నిజదేవుడని బబులోను సామ్రాజ్యాధిపతులు గ్రహించి, ఆ గొప్ప సత్యమును తమ దేశమందంతటా వెల్లడి చేసిరి. అయితే జీవము లేని దేవుండ్లను సేవించు "వారి విగ్రహములు వెండి బంగారువి. అవి మనుష్యుల చేతి పనులు. వాటికి నోరుండియు పలుకవు, కనులుండియు చూడవు, చెవులుండియు వినవు, ముక్కులుండియు వాసన చూడవు, చేతులుండియు ముట్టుకొనవు, పాదము లుండియు నడువవు, గొంతుకతో మాటలాడవు" అని మృత దేవుండ్లను గూర్చి బైబిలు వర్ణించుచున్నది (కీర్త 115:4-7). రాజగు దర్యావేషు అయితే "నా రాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలు యొక్క దేవునికి భయపడుచు ఆయన సముఖమున వణకుచుండవలెను. ఆయనే జీవము గల దేవుడు, ఆయనే యుగయుగము లుండువాడు" అని ప్రకటించెను (దాని 6:26). జీవముగల తండ్రియైన దేవుడు నన్ను పంపెను అని యేసుక్రీస్తు తనను గూర్చి ప్రకటించెను (యోహా 6:57). యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని పేతురు ఒప్పుకొనెను. ఆ గొప్ప

సత్యముపై క్రీస్తు తన సంఘమును కట్టుదును అని వాగ్దానము చేసెను (మత్త 16:16-18). క్రైస్తవులు నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించవలెనని అపొ. పౌలు హెబ్రీ 9:14లో వ్రాసెను. వారు విగ్రహములను విడిచిపెట్టి జీవము గలవాడును, సత్యవంతుడునగు దేవునికి దాసులై యున్నారని అతడు 1 థెస్స 1:9లో మరల హెచ్చరించెను. మనము అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక, మనుష్యుల కందరికి రక్షకుడును, మరి విశేషముగా విశ్వాసులకు రక్షకుడైన జీవముగల దేవునియందు నిరీక్షణ యుంచవలెను అని పౌలు పరిశుద్ధాత్మద్వారా హెచ్చరించుచున్నాడు (1తిమో 6:17;4:10). అందువల్లనే బైబిలు సూచించు దేవుడు. "ఇదిగో నేను, నేనే దేవుడను. నేను తప్ప వేరొక దేవుడు లేడు. నేను శాశ్వతకాలము జీవించు వాడను అని చెప్పుచున్నాడు" (ద్వితీ 32:39-43).

దేవుడు జీవము గల దేవుడు గనుక ఆయన ఆత్మ జ్ఞానము గలవాడు. ఆయన జ్ఞానమూర్తి; ఇచ్ఛను, భావములను, ప్రేమను గలవాడు. అందువలననే ఆయన మనలగు ప్రేమించు దేవుడని బైబిలు నందు చదువుచూ యుంటాము. "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహా 3:16). ఆయన ప్రేమించువాడని మాత్రమే గాక ఆయన మాటలాడును (ఆది 3:9), ఆయన యోచించును అని కూడ బైబిలు బోధించుచున్నది. "నాతలంపులు మీ తలంపుల వంటివి కావు. మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు. ఇదే యెహోవా వాక్కు" అని యెషయా 55:8లో వ్రాయబడి యున్నది. ఆయన వినువాడు. అందుచే "విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డము వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను. గనుక ఆయన ఆలకింపకున్నాడు" అని

బైబిలు బోధించుచున్నది (యెషయా 59:1-2). ఆయన కృప గల దేవుడు, కరుణామయుడు (సంఖ్యా 14:18). ఆయన కనికరము, దయ, దీర్ఘ శాంతము, విస్తారమైన కృపా సత్యములు గలవాడు (నిర్గమ 34:6). ఆయన క్షమించును (నిర్గమ 34:7). ఆయన ఒక్కడే మంచివాడు (మత్త 19:24). దేవునికున్న ఈ లక్షణములు ఆయన ఈ విశ్వమంతటి కన్న గంభీరుడని మనకు సూచించుచున్నవి. ఆయన మూర్తిత్వము గలవాడు.

బైబిలు సూచించు దేవుడు స్వరూపము గలవాడు. అందుకే యేసుక్రీస్తు "మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు, ఆయన స్వరూపము చూడలేదు" అని చెప్పెను (యోహా 5:37). యేసుక్రీస్తు దేవుని స్వరూపము కలిగినవాడై యుండెనని ఫిలిప్పీ 2:6 చెప్పుచున్నది. దేవుడు స్వరూపము గలవాడని బోధించు ఇట్టి వచనములను మనము చూడగానే దేవుడు కూడా మానవుని వంటి స్వరూపము గల వాడని మనము అనుకొనుట సహజము. దేవుడు చూచువాడైయున్నాడు. గనుక ఆయన నేత్రములను కలిగినవాడు (నిర్గ 39:23); వినువాడు గనుక చెవులు గలవాడు (యెష 59:1). ఆయనకొక ముఖమున్నది (నిర్గమ 33:20). వెనుక భాగమున్నది (నిర్గ 33:23) అని బైబిలునందు వ్రాయబడి యున్నది. అంతే కాకుండా ఆయన తన సింహాసనముపై ఆసీనుడై యున్నాడని వ్రాయబడి యున్నది. ఇది ఇట్లుండగా ఏ మానవుడు ఎన్నడు దేవుని చూడలేదని క్రొత్త నిబంధన బోధించుచున్నది. దేవుడు మోషేకు భౌతిక స్వరూపములో కన్పడినట్లు నిర్గమ కాండములో మనకు అభిప్రాయము లేర్పడినను, ఆయన మోషేకు తన దూతద్వారా ప్రత్యక్షమాయెనని అపొ.కా.7:30 చెప్పుచున్నది. అది యిట్లనుచున్నది: ''నలువది ఏండ్లయిన పిమ్మట సీనాయి పర్వతారణ్యమందు ఒక పొదలోని అగ్నిజ్వాలలో ఒక దేవదూత అతని కగపడెను." సీనాయి పర్వతము మీద తనతో మాటలాడిన దేవదూతతోను, మన పితరులతోను అరణ్యములోని సంఘమందు ఉండి మనకిచ్చుటకు జీవ వాక్యములను తీసికొనినవాడితడే'' యని 38వ వచనము చెప్పుచున్నది. అందుకే

“మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు, ఆయన స్వరూపము చూడలేదు” అని యేసు చెప్పెను. ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను”(యోహాను 1:18). “సమీపించరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు” అని 1 తిమో 6:16లో వ్రాయబడియున్నది. ఆయన అక్షయుడును, అదృశ్యుడునగు దేవుడని 1 తిమో 1:17లో వ్రాయబడియున్నది.

దేవుడు అదృశ్యుడే అయినను ఆయన వ్యక్తిత్వము లేనివాడు కాడు. ఆయన స్వరూపము కలిగిన వాడే అయినను మానవుని వంటి భౌతిక కాయుడు కాడు. సరిగదా క్రీస్తు పరలోకమును వీడి ఈ లోకమునకు వచ్చినప్పుడు దేవుని స్వరూపము కలిగిన వాడై యుండియు మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించు కొనెను. ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడెను (ఫిలి 2:6,7). అయితే “ఇక మీదట మేము శరీర రీతిగా ఎవనినైనను ఎరుగము; మేము క్రీస్తును శరీర రీతిగా ఎరిగి యుండినను ఇకమీదట ఆయనను ఆలాగు ఎరుగము” అని 2 కొరింధి 5:16లో అపొ.పౌలు వ్రాసెను.

క్రీస్తు ఇప్పుడు ఆత్మీయ శరీరమును కలిగియున్నాడు. పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ఇట్లనుచున్నాడు: “ప్రకృతి సంబంధమైన శరీరమున్నది గనుక ఆత్మ సంబంధమైన శరీరము కూడ ఉన్నది” (1 కొరింధి 15:44). అందువలన క్రీస్తు యిప్పుడు మహిమతో కూడిన ఆత్మీయ శరీరమును కలిగి యున్నాడు. అందువలన సమస్తమును తనకు లోబరుచుకొనజాలిన శక్తిని బట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గల దానిగా మార్చును” అని క్రైస్తవులకు వాగ్దానము చేయబడినది (ఫిలి 3:21). పునరుత్థాన దినమందు ఈ గొప్ప మార్పు జరుగును. “ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమైయున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్ష పరచ బడలేదుగాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు

ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలి యుందుము" అని 1 యోహాను 3:2లో వ్రాయబడియున్నది. జీవముగల దేవుని చూచు గొప్ప తరుణమును కేవలము క్రైస్తవులు మాత్రమే కలిగియున్నారు. నీవును క్రైస్తవుడవయిన యెడల ఆయన ప్రత్యక్షమైనప్పుడు అది నీకును సాధ్యమే.

యేసుక్రీస్తు నందు విశ్వాస ముంచుము. నీ పాపములను విసర్జించి ఆయన చిత్తమునకు బాప్తిస్మము ద్వారా లోబడుము. అప్పుడు జీవముగల యెహోవా దేవుడు నిన్ను రక్షించును.

**– జాషువా గూటం**

## సంఘవిశ్వాసము
(Creed of the Church)

Credo అను లాటిన్ పదము నుండి Creed అను ఆంగ్ల పదముద్భవించినది. క్రీడ్ అను ఆంగ్ల పదమును ఇట్లు నిర్వచింపవచ్చును: "అధికారపూరితమైన భక్తి సూత్రము, ఒక విశ్వాసము; విశ్వాసము నొప్పుకొను ఏదైనా ఒక సూత్రము, పాటించబడు సిద్ధాంతము యొక్కయు, అభిప్రాయముల యొక్కయు సంగ్రహణ". విశ్వాసప్రమాణము అనగా కొందరు "అపొస్తలులు విశ్వాన ప్రమాణము" లేదా "నైసీన్ ప్రమాణమును" తలంచుదురు. అయితే వానిలో ఏ ఒక్కదాని గూర్చియు బైబిలునందు లేదు. అయితే ప్రతి మానవకల్పిత సంఘము మానవకల్పిత ప్రమాణ పుస్తకములను కలిగి యున్నది. అట్టివన్నియు దేవుని వాక్యమునకు అదనముగా కల్పించినట్టివే.

బైబిలులో ఉన్న దానికంటె ఎక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము ఏదైనను బైబిలును మితిమీరినదగును. బైబిలు నందున్న దానికంటె తక్కువ కలిగిన ప్రమాణ పుస్తకము బహు తక్కువ కలిగియుండును. బైబిలు నందున్న సంగతులే కలిగియున్న ప్రమాణపుస్తకము, మన యెుద్ద బైబిలు ఉన్నందున ప్రయోజనము లేనిదగును. మనము దేవుని వాక్యమునకు కలుపుట గాని, తీసి వేయుటగాని లేదా వేరొకటి దానియందుంచుట గాని చేయరాదని ప్రకటన 22:18, 19; గలతీ 1:6-9లు

వక్కాణించుచున్నవి. వేరొక మాటలో - లేఖనములు సంపూర్ణములు, అవి పరిపూర్ణములు (2 తిమో 3:16, 17;యాకోబు 1:25). మనము దైవోక్తులను బోధింపవలెను (1పేతురు 4:11). అందువలన ఇతర గ్రంధముల యొక్క అవసరత ఏమియును లేదు.

నేటి క్రైస్తవ లోకమంతయు మానవకల్పిత ప్రమాణములవలననే విభజింపబడెను గాని బైబిలు ననుసరించుటవలన మాత్రము కాదు. ప్రతి సంఘము దాని ప్రత్యేక నియమమును కలిగియండవలెనని కొందరు వాదింతురు. ఆలాగనుటలో వారు బైబిలును విసర్జించిరి యని యర్థము ఎంత విచారము! అందువలననే మానవకల్పిత గ్రంధములను విసర్జించి, దేవుని వాక్యమయిన బైబిలు నొద్దకు మరలవలెనని మేము అందరినీ కోరుచున్నాము. బైబిలు మనలను యేసుక్రీస్తు నందు ఏకము చేయునుగాని వేరుచేయదు.

క్రీస్తు సంఘము యొక్క విశ్వాస ప్రమాణము ఏమి? క్రీస్తు తప్ప వేరొక రక్షకుడు మనకు లేడు, బైబిలు తప్ప వేరొక ప్రమాణము మాకు లేదు. మత సంబంధమైన మన అభిప్రాయములు, తలంపులు నిష్ప్రయోజనములు. బైబిలును గూర్చిన స్వకీయవివరణము మాకులేదు. మాకు ఉన్నదంతయు బైబిలు మాత్రమే. దాని బోధలకు మేము లోబడియుంటిమి, మరియు ఇతరులకు దానిని సూచించుచుంటిమి. అందరును దానిని గ్రహించవలెనని మేము కోరుచున్నాము (యోహా 5:39;2 తిమో 2:15). మనుష్యులందరు, అంతటను బైబిలు బోధించునట్లే చేయవలెనని మేము కోరుచున్నాము.

వేమము అనుసరించు అదనపు గ్రంధము లేక గ్రంధములు ఏమియును లేవు. ఏమానవుడును బైబిలుతో సరిసమానమగు నియమవాళి వ్రాయలేడు అని మావిశ్వాసము. అట్టి గ్రంధమును వ్రాయుటకు ప్రభువు ఎవరికిని అధికారమునియ్యలేదు. అట్టి గ్రంధమును వ్రాయటకు పరిశుద్ధాత్ముడు ఎవరికిని ఆత్మీయావేశము నీయులేదని మా విశ్వాసము.

దేవుని యొద్ద నుండి, దైవావేశముచే నీయబడిన దేవుని వాక్యము మాత్రమే మనలను రక్షించును. సరిగదా ఆ దేవుని వాక్యమే మనలను అంత్యదినమందు తీర్పు తీర్చును (యోహా 12:48). అనేక ఇట్టి కారణముల వలన మతసంబంధ సంగతులలో దానిని మేము మార్గదర్శిగా అంగీకరించుచు, ఇతరులు కూడ అట్లే చేయవలెనని ప్రోత్సహించుచున్నాము.

బైబిలు సత్యము అయినందున

సత్యమును ఎరుగుటకు దాని యొద్దకు మేము వెళ్లుదుము. సత్యస్థావరము నొద్దకు వెళ్ళని యెడల సత్యమును కనుగొనలేము గదా. అందువలన సత్యమును నమ్ముటకు ముందు నీవు సత్యమును వినవలెను (రోమా 10:17). మత సంబంధ సంగతులను గూర్చి నేడు అనేకులు మోసపోవుచున్నారంటే ఆశ్చర్యము లేదు. నేటి క్రైస్తవలోకమందు గొప్ప భేదములు, గందరగోళము ఉన్నవంటే ఆశ్చర్యము లేదు. సహాయము కొరకు మానవులు దేవుని యొద్దకు వెళ్లుటకంటె మనుష్యుల బోధనల యొద్దకు వెళ్లుచున్నారు. మానవుడు రక్షింపబడవలెననిన అతడు తప్పక బైబిలు నొద్దకు మరలవలెను.

సంఘమును గూర్చిన సత్యమును తెలుసుకొనుటకు మానవులు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించు చున్నాము. నకిలీ సంఘము లనేకములు నేడు లోకమునందున్నవి. అయితే ఏది సరియైనది? ప్రతి ఒక్క దానిని ఒకడు పరిశోధింపవలెనా? అట్లు కాదుగాని సంఘము గూర్చి సత్యమును బోధించు గ్రంథమునతడు పరిశోధింపవలెను. క్రీస్తు సంఘమును గూర్చిన సత్యమును ఎరిగిన తరువాత, బైబిలు బోధలననుసరించి నడుచుకొను సంఘమును కనుగొనుట కష్టముకాదు.

రక్షణ పొందుటకు మానవుడేమి చేయవలెనను సత్యమును తెలిసి కొనుటకు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించు చున్నాము. రక్షణ పొందుటకు అనేక మార్గములున్నవని మానవులు బోధింతురు. అయితే దేవుని వాక్యము నొద్దకు వెళ్ళిన యెడల, ఒకడు సత్యమును వినవలెనని, విశ్వసించ వలెనని, తన పాపముల విషయమై మారుమనస్సు నొందవలెనని మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని గ్రహించగలము (మార్కు 16:15,16; అపో.కా. 2:38). మనుష్యులు బోధించు వాటిలో ఏమియును లేదు. రక్షించువాడు ప్రభువు గనుక ఒకడు ఆయన వాక్యమును విని ఆయనకు విధేయత చూపిన యెడల రక్షించబడ గలడు.

దేవుని నారాధించుట యెట్లోయను సత్యము నెరుగుటకు మానవులు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము ప్రోత్సహించు చున్నాము. మానవులెన్ని చెప్పినను, ఆరాధన మార్గములనేకములు లేవు. ఒకే ఒక్క మార్గమున్నదని, ఆ మార్గము ఎట్టిదై యున్నదోయని కూడ ప్రభువు తన వాక్యమునందు వివరించెను (యోహా 4:24).

ఈ విషయములను గూర్చి మాత్రమే

గాక జీవమును గూర్చియు, భక్తిని గూర్చియు ఉన్న ప్రతి అంశమును గూర్చిన సత్యమును తెలిసికొనుటకు అందరు బైబిలు నొద్దకు వెళ్ళవలెనని మేము కోరుచున్నాము. బైబిలును మనము అర్ధము చేసికొనలేమని, అందరు ఒకేరీతిగ అర్ధము చేసికొనలేరని మానవులు మనలను నమ్మించ యత్నించుచుండినను, అది సత్యము కాదు. మానవుడు నశించి పోవునట్లు బైబిలుకు అతడు దూరముగ యుండ వలెనని అపవాది కోరుచున్నాడు. అయితే రక్షింపబడ వలెననిన అతడు బైబిలు యొద్దకు వచ్చి దానిని విశ్వసించి, భక్తి విషయములలో దానిని మాత్రమే మార్గదర్శిగా అతడుంచుకొనవలెను. అప్పుడు మాత్రమే అతడు సరియగును గనుక అప్పుడు మాత్రమే రక్షింపబడగలడు.

మా విశ్వాసప్రమాణము ఏమిటి? యేసుక్రీస్తు, ఆయన వాక్యమును. ఆయన తప్ప వేరొకడు లేడు. క్రీస్తు దేవుని కుమారుడని మేము నమ్ముదుము. ఆయన వాక్యమే సర్వసత్యము. మేము దాని నంగీకరించినడుతుము. అందరు అట్లే చేయవలెనని మేము కోరుచున్నాము. మానవ కల్పిత ప్రమాణములన్నియును ఒకే ఒక్కచోటునకు నడుపును–నరకము. యేసు "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6).

– జె.సి.ఛోట్


**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

# యోగ్యుడైన గొర్రెపిల్ల

(Worthy is the Lamb)

**పరిచయము:** మొదటి అధ్యాయములో క్రీస్తుయొక్క విశిష్ట వర్ణన ఇయ్యబడినది.

1. రెండు మూడు అధ్యాయాల్లో ఆసియాలోని ఏడు సంఘములను గూర్చి చెప్పబడినది.

2. నాలుగవ అధ్యాయం దేవుని యొక్క సింహాసనాన్ని, దాని యందు ఆసీనుడైన వానిని మనకు వర్ణించింది.

3. ఐదవ అధ్యాయంలో దేవుని గొర్రెపిల్లను గూర్చి తెలిసికొనబోవు చున్నావు.

4. ఈ అధ్యాయ ఆరంభములో యోహాను దేవుని కుడిచేత నున్న ఒక గ్రంథమును చూచెను. ఆ గ్రంథము లోపటను వెలుపడను వ్రాత కలిగి యుండెను. యిది చాల ప్రాముఖ్య గ్రంథమని మనం గ్రహించుకోవచ్చును.

5. ఆ గ్రంథమునకు యేడు ముద్రలు గట్టిగావేయబడి యుండెను. ఏదైనా ప్రాముఖ్య పత్రము ఏడుగురి సాక్షులతో ముద్రవేయబడవలెననునది రోమా దేశ చట్టము. ఆలాగున వేయబడిన ప్రతి పత్రము చుట్టూ ఏడు దారములు కట్టి యుంచేవారు. ఆ ఏడుగురు సాక్షులు తిరిగి వచ్చినప్పుడే ఆ పత్రము తెరువబడేది.

6. దాని ముద్రలు తీసి ఆ గ్రంథమును విప్పుటకు యోగ్యుడెవడని బలిష్టమైన యొక దూత బిగ్గరగా పలికెను. ఇక్కడ యోగ్యుడు అనే మాటను గుర్తించుము. దాన్ని విప్పువాడు తరువాత సంభవించే వాటిని కంట్రోలు చేసే శక్తి గలవాడు.

7. ఆ గ్రంథమును విప్పుటకైనను చూచుటకైనను ఎవనికి శక్తి లేకపోయినందున యోహాను బిగ్గరగా ఏడ్చెను (4వ).

**I. ఇదిగో దావీదు చిగురైన యూదా గోత్రపు సింహము ! (5వ)**

A. బైబిలు కాలములో ఘనుడైన కుమారుని 'సింహము' అని వర్ణించేవారు. యాకోబు యూదాను

ఆశీర్వదించినప్పుడు, "యూదా కొదమ సింహమని" వర్ణించెను. "గర్జించు ఆడ సింహము వలెను అతడు కాళ్లు ముడుచుకొని పండుకొనెనని" చెప్పెను. మరల షిలోహ (క్రీస్తు) వచ్చు వరకు యూదా యొద్దనుండి దండము తొలగదు. అతని కాళ్ల మధ్య నుండి రాజ దండము తొలగదని కూడ చెప్పెను (ఆది. 49:9-10). క్రీస్తు యూదా గోత్రములో జన్మించెననునది వాస్తవమే (హెబ్రీ 7:14).

B. క్రీస్తు దావీదు చిగురు అని కూడ చెప్పబడెను. "యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టను. వాని వేరుల నుండి అంకురము ఎదిగి ఫలించును. యెహోవా ఆత్మ ... అతని మీద నిలుచును" అని యెషయా 11:1-2లో చెప్పబడి యున్నది. అపొ.కా. 2:30లో పేతురు దావీదు గర్భఫలములో నుండి అతని సింహాసనము మీద ఒక కూర్చుండ బెట్టుదునని దేవుడు చేసిన వాగ్దానమును గూర్చి చెప్పెను. యేసుక్రీస్తు దావీదు వంశములో పుట్టినవాడే. ప్రకటన 22:16ను బట్టి క్రీస్తే దావీదు చిగురును వాని వేరుల నుండి ఎదిగిన అంకురమునై యున్నారు.

C. ఆ గొర్రె పిల్లకు ఏడు కొమ్ములును, ఏడు కన్నులు ఉండెను (6వ). ఆ కన్నులు భూమియంతటికిని పంపబడిన దేవుని ఏడు ఆత్మలు. దేవుని కన్నులు ఈ విశ్వం అంతటా వ్యాపించియున్నవి. ఆయనకు సమస్తము ఎరుకే, క్రీస్తు సర్వజ్ఞాని.

**II. యోగ్యుడైన గొర్రెపిల్ల (7-14వ).**

A. క్రీస్తు వచ్చి తండ్రియైన దేవుని చేతిలో నుండి ఆ గ్రంథమును తీసికొనెను. ఆ నాలుగు జీవులును, యిరువది నలుగురు పెద్దలును గొర్రెపిల్ల యెదుటసాగిల పడిరి.

B. వారు వీణెలును, దూపద్రవ్యములతో నిండిన సువర్ణ పాత్రలను పట్టుకొని యుండిరి.

పరలోకంలో తీగెలుంటే వాటిని ఇక్కడ ఎందుకు ఉపయోగించ కూడదని కొందరంటారు. వీణెలు

నిజమయితే, ధూపద్రవ్యములు కూడ నిజమేకావాలి.

వారు పట్టుకొని యున్న పాత్రలు పరిశుద్ధుల ప్రార్ధనలు!

C. వారు క్రొత్తపాట పాడుచుండిరి (10వ) నిజానికి వారు పాడుచూ యుండిరి.

D. ఈ గ్రంథములో ఇప్పటికే రెండు కీర్తనలు పాడుట చూచాము.

ఆ నాలుగు జీవుల స్తుతి గీతము (4:8-9).

24 గురు పెద్దలు పాడిన సృష్టి గీతము (4:10-11).

E. ఇప్పుడు విమోచన గీతము. ఈ పాటను ఆ నాలుగు జీవులును, 24 గురు పెద్దలును పాడుచుండిరి.

F. "నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు" అని కీర్తించిరి. ఆయన ఎందుకు యోగ్యుడు?

1. ఆయన వధింపబడెను.

2. ఆయన విమోచించినవాడు. తన రక్తమిచ్చికొన్నారు (ఎఫెసీ 1:7). పాపక్షమాపణ నిమిత్తము తన రక్తాన్ని చిందించారు (మత్త 26:28). తన స్వరక్తమిచ్చి సంఘమును కొనెను (అపొ.కా. 20:28). నిర్దోషమును నిష్కళంకము నైన గొర్రెపిల్ల రక్తము చేత మనము విమోచింపబడితిమి (I పేతురు 1:18-19).

3. ఆయన ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారి లోను ప్రతి ప్రజలోను, ప్రతి జనములో నుండు ప్రజలను విమోచించారు. ఆయన ఈ లోక రక్షకుడగునట్లు మరణ మొందెను (యోహాను 4:42).

4. ఆయన వారిని "దేవునికి ఒక రాజ్యముగాను యాజకులుగాను చేసెను" గనుక యోగ్యుడు. (ప్రక 1:5 చూడుము).

5. గనుక వారు భూలోక మందు ఏలుదురు. ప్రభువుతో కలిసి ఇప్పుడు ఏలుచున్నారు. ప్రభువు ఇప్పుడు రాజ్యపాలన చేయుచున్నారు. క్రైస్తవులు ఇప్పుడు "మరి నిశ్చయముగా యేసుక్రీస్తను ఒకని

ద్వారానే యేలు చున్నారు" (రోమా 5:17). క్రీస్తు మరల వచ్చినప్పుడు తాను పాలించుచున్న రాజ్యమును తండ్రికి అప్పగించును. అప్పుడు అంతము వచ్చును (I కొరింథి 15:24-26).

**III. ఈ విశ్వమంతయు గొర్రెపిల్లకు స్తోత్రములు చెల్లించుట (11-14వ).**

1. పెద్దలును, జీవులును ఆయనను స్తుతించిరి.

2. వారిని ఆవరించి యున్న అనేక దూతలు స్తుతించితిరి.

3. వారు వధింపబడిన గొర్రెపిల్ల స్తోత్రము పొందనర్హుడని గొప్ప స్వరముతో స్తుతించిరి.

4. గొర్రెపిల్లయగు క్రీస్తు దిగువ 7 సంగతులను బట్టి స్తోత్రార్హుడని వారు చెప్పిరి.

a. శక్తియు (I కొరింథీ 1:24)
b. ఐశ్వర్యమును (II కొరింథీ 8:9)
c. జ్ఞానమును (I కొరింథీ 1:24)
d. బలమును (ప్రకటన 1:8)
e. ఘనతయు (ఫిలిప్పీ 2:11)
f. మహిమయు (యోహాను 1:14)
g. స్తోత్రమును పొందనర్హుడు

**I. క్రీస్తు వారి ఆరాధననంగీకరించెను.** దూతలు ఆరాధననంగీకరించరు (ప్రక 19:10). క్రీస్తు దూత కాదు. ఆయన దేవుడు. ఆరాధనీయుడు. ఆ నాలుగు జీవులు ఆమేన్ అని చెప్పగా ఆ పెద్దలు సాగిలపడి ఆరాధించిరి (నమస్కారము చేసిరి).

**ముగింపు:** క్రీస్తు దేవుని ఘనుడైన ఏకైక కుమారుడు (యోహాను 3:16). ఆయన జయించారు. యిదే శుభవార్త, సువార్త! అవును క్రీస్తు వధింపబడ్డారు. ఆయన రక్తము ద్వారా మనం రక్షింపబడి పరలోకము వెళ్లగలము! అందువలన ఆయనను ఈ విశ్వమంతా స్తుతించాలి. నేటిలోకము ఆయన సువార్తకులోబడితే మేలు. లేదా తీర్పునాడు ఆయన యెదుట తమ మోకాళ్లూనవసివస్తాది!

**- జాన్ స్టేసీ**

# రాజైన యెహోషాపాతు యొక్క ప్రఖ్యాతి, పతనము

(The Rise and Fall of King Jehoshaphat)

పౌలు, దావీదు, సొలొమోనులు సమైక్య ఇశ్రాయేలు రాజ్యమును ఒక్కొక్కరు నలువది సంవత్సరములు మట్టుకు పాలించిరి. సొలొమోను తరువాత అది ఉత్తర రాజ్యముగను, దక్షిణ రాజ్యముగను విభజింపబడెను. ఉత్తరాన్న ఉన్న ఇశ్రాయేలు రాజ్యములో పది గోత్రములుండగా, దక్షిణాన్న యూదా రాజ్యములో దావీదు వంశస్థులగు రెండు గోత్రములుండిరి. ఇశ్రాయేలు దేశమును పాలించిన రాజులందరు దేవుని దృష్టిలో దుర్మార్గులైరి. వారు విగ్రహముల నారిధించుచు విగ్రహారాధనను ప్రోత్సహించిరి. యూదయను పాలించిన వారిలో కొంతమంది మంచి వారుండిరి. వారిలో యెహోషాపాతు ఒకడు.

యెహోషాపాతు యూదయను 25 సంవత్సరముల మట్టుకు జ్ఞానము గలవాడై పాలించెను. అతడనేక సంస్కరణలను ప్రవేశపెట్టెను. అతడు లేవీయులను, యాజకులను ఉపదేశకులను దేవుని ధర్మశాస్త్రము నుపదేశించుటకు ఆయా పట్టణములకు పంపుచుండెను. తద్వారా ప్రజలను దేవునివైపు మళ్లించుటకు ప్రయత్నించెను. "యెహోషాపాతు యెరూషలేములో నివాసము చేయుచు బేయేర్షెబా నుండి ఎఫ్రాయిము మన్యము వరకు జనుల మధ్యను సంచరించుచు, వారి పితరుల దేవుడైన యెహోవావైపు వారిని మళ్లించెను. మరియు అతడు ఆయా పట్టణములలో న్యాయాధిపతులను నిర్ణయించెను" (2 దినవృ 19:4,5). అతడు తన పితరుల మార్గములో నడిచెను గనుక దేవుడతనికి తోడై యుండెను. దావీదు వలె అతడును బయలు దేవతను గాక యెహోవా దేవుని నారాధించెను. అతడు తన పితరుల మార్గములో నడుచుచు, ఇశ్రాయేలు వలె గాక దేవుని ఆజ్ఞలను పాటించెను. అతడు తన రాజ్యమును స్థిరపరచెను. యూదావారందరు అతనికి బహుమానము లిచ్చిరి. ఫిలిస్తీయులలో కొందరును, అరబీయులును అతనికి

పన్నును, కానుకలను ఇచ్చుచు వచ్చిరి. అందువలన అతనికి ఐశ్వర్యమును, ఘనతయు అధికముగా కలిగెను. దేవుని మార్గములో నడుచుటకు అతని హృదయము సంతోషించెను. అతడు ఉన్నత స్థలములను దేవతా స్థంభములను యూదాలో నుండి తీసివేసెను (2 దినవృ 17:3-6).

### రాజు యొక్క ప్రఖ్యాతి

దిన వృత్తాంతములు 18వ అధ్యాయములో అతడు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో కలిసి రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు వెళ్లవచ్చునో లేదో యని దేవుని విచారించినట్లు మనము కనుగొనగలము. అయితే దేవుని ప్రవక్తయగు మీకాయా యొక్క సలహాకు వేరుగా వారు యుద్ధమునకు పోయిరి. ఆ యుద్ధములో ఇశ్రాయేలు రాజగు ఆహాబు చనిపోయెను.

యెహోషాపాతు అంతకంతకు గొప్పవాడై యూదా దేశము నందు కోటలను, సామాగ్రిని నిలువచేయు పట్టణములను కట్టించెను. అతని క్రింద పరాక్రమశాలులైన సైన్యముండెను (2 దినవృ 17:12-19).

మోయాబీయులును, అమ్మోనీయులును, మెయోనీయులలో కొందరును దండెత్తి యెహోషాపాతు మీదికి రాగా అతడు భయపడి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొనెను. యూదా అంతట ఉపవాస దినము ఆచరింపవలెనని ప్రకటింపగా ప్రజలందరు యెరూషలేములో దేవుని సహాయము నభ్యర్థించుటకు గాను కూడుకొనిరి. ఆసాపు సంతతివాడును లేవీయుడునగు యహజీయేలు మీదికి దేవుని ఆత్మరాగా, అతని ద్వారా ప్రభువు వారికి విజయాన్ని వాగ్దానం చేసెను.

అంతటవారు ఉదయముననే లేచి తెకోవ అరణ్యమునకుపోయిరి. యెహోషాపాతు జనులను హెచ్చరిక చేసి యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము మందర నడుచుచు, యెహోవా కృప నిరంతర ముండును. ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను. వారు పాడుటకును స్తుతించుటకును మొదలు పెట్టగా యెహోవా యూదా వారి మీదికి వచ్చిన అమ్మోనీయుల మీదను మోయాబీయుల మీదను శేయూరు మన్యవాసుల

మీదను మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి. దేవునికి స్తుతి గానము చేయుచు వారు యుద్ధము జయించిరి. నరిగదా శత్రుశవముల యొద్ద విస్తారమైన ధనమును, ప్రశస్తమైన నగలును వారికి కనబడెను. వారు కొంచుపోలేనంత విస్తారమైన ధనము వారి వశమాయెను. కొల్లసొమ్ము విస్తారమైనందున దానిని కూర్చుటకు మూడు దినములు పట్టెను. ఇశ్రాయేలీయుల శత్రువులతో యెహోవా యుద్ధము చేసెనని దేశముల రాజ్యనివాసులు వినగా దేవుని భయము వారందరి మీదికి వచ్చెను. ఈ ప్రకారము అతని దేవుడు చుట్టు వున్న వారిని జయించి అతనికి నెమ్మది ననుగ్రహింపగా యెహోషాపాతు రాజ్యము నిమ్మళముగా నుండెను. దేవునితో అతడు సహవాసము కలిగి యున్నంతవరకు దేవుడతనికి తోడైయుండెను.

### రాజు యొక్క పతనము

యెహోషాపాతు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో వియ్యమందినందున దేవుని ఉగ్రతను తనమీదకి తెచ్చుకొనెను. ఆహాబుతో కలసి అతడు రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు పోయెను. ఆ యుద్ధములో ఆహాబు చనిపోగా, దీర్ఘదర్శియగు యెహూ నీవు భక్తిహీనులకు సహాయము చేసి యెహోవా శత్రువులకు స్నేహితుడవైతివి గదా? అనెను. అందువలన యెహోషాపాతు తన పాలన చివరి భాగములో మిక్కిలి దుర్మార్గముగా ప్రవర్తించిన అహజ్యాతో స్నేహము చేసెను. అప్పుడు మారేషా వాడును దోదావాహు కుమారుడునగు ఎలీయెజెరు - నీవు అహజ్యాతో స్నేహము చేసికొంటివి గనుక యెహోవా నీ పనులను భంగము చేయునని యెహోషాపాతు మీద ప్రవచనమొకటి చెప్పెను (2 దినవృ 20:35-37).

యెహోషాపాతు దేవునితో నడిచినంత కాలము ఆశీర్వదించబడెను, ధనికుడయ్యెను. అయితే దుర్మార్గులైన రాజులగు ఆహాబు, అహజ్యాలతో అతడు ఏకీభవించినప్పుడు ఆయన దృష్టికి కీడు చేసిన వాడాయెను.

అవిధేయతను బట్టి సౌలు రాజు శిక్షించబడెను. వ్యభిచార కారణము వలన దావీదు శిక్షననుభవించెను. సొలొమోను అన్యస్త్రీలను వివాహమాడినందున ఇశ్రాయేలు దేశము రెండు ముక్కలాయెను. ఇశ్రాయేలు దేశపు

దుర్మార్గ రాజులతో సహవాసము చేసినందున యెహోషాపాతు శిక్షించబడెను.

"మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసికి విశ్వాసితో పాలెక్కడిది?'' యని అపొ.పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీ 6:14-16). హానోకు దేవునితో నడిచెను గనుక దేవుడతనికొనిపోయెను. విగ్రహారాధికులతో సాంగత్యము చేయకుండు నిమిత్తము అబ్రాహామును దేవుడు పిలిచెను. అతడు దేవునికి లోబడి ఈలోక జనాంగములన్నిటికి దీవెనకు కారకుడాయెను. పోతిఫరు భార్యతో సహవసించనందున యోసేపు దీవించబడెను, ఐశ్వర్యవంతుడాయెను. మోషే అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి ఫరో కుమార్తె యొక్క కుమారుడనని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు" (హెబ్రీ 11:24-25). యెహోషువాయు, అతని కుటుంబమును విగ్రహములను గాక సజీవుడైన దేవుని సేవించుటకు ఎంచుకొనెను.

**దుష్టసాంగత్య ఫలితము**

దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపునని వారందరు ఎరుగుదురు (1కొరింథీ 15:33). దుష్టుల నుండి మనం దూరముగా యుండాలని ప్రభువు మనకు తరచు హెచ్చరిక చేయుచున్నారు. ఏలయగనా పులిసినపిండి కొంచెమైనను ముద్ద అంతయు పులిచేయును (గలతీ 5:9).

హవ్వ దేవుని సహవాసమును వీడి అపవాది మాటలకు లోబడినప్పుడు పాపములో పడింది. శిక్షించబడింది. ఏశావు అన్య స్త్రీలను వివాహమాడి శ్రమల పాలయ్యెను. పరాక్రమశాలుడైన సంసోను దుష్టుల ఆలోచన చొప్పున నడిచి, పాపుల మార్గమున నిలిచి, అపహాసకులు కూర్చుండు చోట కూర్చొని పతనమయ్యెను.

దుష్ట సాంగత్యము అపాయకరము. దుష్టులతో సహవాసము చేస్తే యెహోషాపాతుకు జరిగినట్లు దేవుని ఉగ్రత మన మీదికి వచ్చును. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు

మనలను నియమించెను గాని ఉగ్రత పాలవుటకు నియమించలేదు" (1 థెస్స 5:9). మానవులను రక్షించుటకు తండ్రియైన దేవుడు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందిన వారు రక్షింపబడుదురు. సంఘముతో చేర్చబడుదురు. నిత్యజీవమునకు వారసులవుదురు "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము; అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము" (రోమా 6:23). "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు" (రోమా 8:1).

"ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగెవలె బయటపారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" అని యేసు ప్రభువు చెప్పెను (యోహాను 15:6). మనం క్రీస్తులో యుంటూ లోకముతో సాంగత్యము చేయలేము. మరణ పర్యంతము మనము క్రీస్తుతో ఆయన వాక్యము ద్వారాను, ప్రార్థన ద్వారాను సహవాసము కలిగియుండాలి. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

పరిశుద్ధులతో మనం సహవాసం కలిగియుంటే, బలపడగలము. గాని దుష్టులతో సాంగత్యం చేస్తే దేవుని ఉగ్రతకు పాలవుదుము. "ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగునని" యాకోబు చెప్పెను (యాకోబు 4:4). నీవు దేవుని మిత్రుడవా? లేక శత్రువువా? దేవుడు నీ పక్షమున యుండగోరుచున్న యెడల దుష్ట సాంగత్యమును విడనాడుము. లేదా యెహోషాపాతు వలె దేవుని ఉగ్రతకు పాత్రుడవగుదువు.

**– కవితా గూటం, కాకినాడ.**

## క్రీస్తు సంఘము, మత శాఖలు

(The Church and the Denominations)

క్రీస్తు సంఘమునకును వివిధ మత శాఖలకును యున్న వ్యత్యాసమేమి? ఈ వ్యాసములో ఆధునిక మతశాఖలను గూర్చి క్లుప్తముగా తెలిసికొందాము.

• తాను వాగ్దానము చేసిన రీతిగా యేసుక్రీస్తు మరణించి, సమాధి చేయబడి పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తునాడు తన సంఘమును స్థాపించెను (మత్తయి 16:18; అపో.కా. 2).

• క్రొత్త నిబంధన కాలములో ఒకే ఒక్క సంఘముండెను. ప్రతి క్రైస్తవుడు దాని సభ్యుడై యుండెను.

• ఆనాటి ఆదిమ క్రైస్తవుల విశ్వాసమునకు, ఆచరణకు యున్న ఏకైక మార్గదర్శి దేవుని వాక్యమే (2 యోహాను :9; I పేతురు 4:11;2 తిమో 3:16-17).

• క్రీస్తు యొక్క సంఘము మతశాఖ కాదని గమనించుము.

• ఆదిమ నమూనా నుండి, విశ్వాసము నుండి ప్రజలు తొలగి పోవుదురని ప్రభువు ముందుగానే హెచ్చరించెను. అట్లే విశ్వాస భ్రష్టత్వము సంభవించెను (I తిమో 4:1; 2 తిమోతి 4:3,4; అపో.కా. 20:29,30, 2 థెస్స 2:3).

• రోమన్ కేథలిక్కు సంఘమను ఒక నన్న ఆదిమ విశ్వాసమునుండి తొలగిపోయిన వారి వలన ఉద్భవించెను. అది క్రీస్తు తన సంఘమును స్థాపించిన కొన్ని శతాబ్దములకు ఆరంభించెను.

• రోమన్ కేథలిక్కు సంఘమును సవరించుటకు గాను ప్రొటెస్టాంటుల మొదటి డినామినేషన్ ఆరంభమాయెను.

• కేథలిక్కుల తప్పుడు పద్ధతులను కొన్ని వారు సవరించినను ప్రొటెస్టాంటులు అనేక యితర తప్పుడు పద్ధతులను ప్రవేశపెట్టిరి. అవేవనగా

- వందలాది శాఖలు
- లేఖన విరుద్ధమైన నామములు
- లేఖన విరుద్ధ బోధలు
- లేఖన విరుద్ధ పాలన పద్ధతులు
- లేఖన విరుద్ధ ఆరాధన

– రక్షణ సంకల్పమును సత్యవాక్య ప్రకారము బోధించక పోవుట.

ప్రజలు మతశాఖల పద్ధతులను విసర్జించి క్రొత్త నిబంధన విశ్వాసమును, ఆచరణను అనుసరించుటకు నిశ్చయించు కొన్న చోట క్రీస్తు సంఘములు నేడున్నాయి. బైబిలు సంకల్పముకు భిన్నముగా యున్న ప్రతి పద్ధతికి వేము విరోధము. నిజసంఘము మత శాఖకాదు. దానిని ఎరుగని వారు అదొక మత శాఖ యని తలంతురు. ప్రజలు లేఖన విరుద్ధ సంగతులను మానవ కల్పిత శాఖలను విసర్జించి బైబిలు మార్గములో ప్రవేశించాలని వారిని గూర్చి నిరంతరము ప్రయత్నించాలి.

ప్రజల హృదయాలను, ఉద్దేశాలను ప్రశ్నించుట మా పనికాదు గాని ఏయే బోధలు, పద్ధతులు, ఆచారాలు లేఖన విరుద్ధములో మనం తెలిసికోగలము. వాటిని దేవుని వాక్యముతో పోల్చి చూడగా అవి వాక్య విరుద్ధములని గ్రహించగలము. దేవుని వాక్యానికి విరుద్ధమైనవి దేవునికి విరుద్ధమైనవే! గలతీ 1:6–9 చూడుము.

ప్రజలు డినామినేషన్లకు అలవాటు పడిపోయినందున, అవి నిజ క్రైస్తవ్యానికి భిన్నమైనవి వారు గ్రహించుకొనుట కష్టము. అందువలన క్రీస్తు సంఘము కూడ ఇంకొక మతశాఖ యని వారు భావిస్తారు గాని:

– సంఘమును క్రీస్తే స్థాపించెను (మత్తయి 16:18).

– అదొక డినామినేషన్ కాదు

– అది కేధలిక్కులదిగాని ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు.

– దాని ఏకైక విశ్వాస ప్రమాణము బైబిలు మాత్రమే.

– దాని ఆచార పద్ధతులు అన్నీ బైబిలును బట్టియే యుండును.

మానవ పద్ధతులను గాక బైబిలును మాత్రమే ప్రజలు ఎక్కడ అనుసరించినా అక్కడ క్రీస్తు సంఘముండును.

– డేవిడ్ ఫార్.

## సంక్షిప్త వార్తలు

సత్యవాణి క్రీస్తుసంఘ అధ్వర్యంలో 2007 మార్చి 19వ తేదీ సోమవారం CROS సంస్థ ద్వారా మాధవ పట్నంలో ఉచిత కంటి వైద్య శస్త్రచికిత్సా శిబిరం నిర్వహించబడెను. **పిఠాపురం** క్రిష్టియన్ మెడికల్ సెంటర్ కంటివిభాగంలో పనిచేయుచున్న కంటి వైద్యనిపుణులు వారి బృందము స్వయంగా కంటి పరీక్షలు నిర్వహించి అవుసరమైనవారికి మందులు, శస్త్రచికిత్సలు ఉచితముగా చేసిరి. ఆ ఒక్కరోజులో 189 రోగులు పరీక్షించబడిరి. వారిలో 71 మందికి పిఠాపురంలో CMC లో ఉచితంగా శస్త్రచికిత్స చేయబడినది. వారు తమ కంటిచూపును తిరిగి పొంది దేవుని స్తుతించుచున్నారు. ఈ కంటి వైద్య శిబిర కార్యక్రమం అంతా రిక్కీ గూటం గారి పర్యవేక్షణలో జరిగినది. జయప్రదం గావించబడినది. అందులకు దేవునికి స్తోత్రం.

2007 ఏప్రియల్ 5వ తేదీనాడు S. సావరం గ్రామంలో సుగుణరావు గారి యింట జరిగిన వివాహ కార్యక్రమంలో రిక్కీ గూటం గారు, వారి సతీమణి సుదీప గూటం గారు హాజరై నవదంపతులను అభినందించిరి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కోరుకొండలో జరిగిన సోదరులు కె.కొర్నేలియస్ గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమములో రిక్కీ గూటం దంపతులు పాల్గొనిరి.

2007 ఏప్రియల్ 27వ తేదీ శుక్రవారం కాకినాడ సమీపములో యున్న పెదపూడి గ్రామంలో అతి సుందరముగా నిర్మించబడిన పెదపూడి వొకేషనల్ కాంప్లెక్స్ బిల్డింగ్ ప్రారంభోత్సవం చేయబడినది. పెదపూడి క్రీస్తు సంఘ సువార్తికులు సోదరులు యమ్. సూర్యారావ్ గారి అధ్వర్యంలో అది

నిర్మించబడినది. ఆ కార్యక్రమమునకు పలువురు ప్రముఖులు, సువార్తికులు ఆయా సంఘముల సభ్యులు హాజరైరి. సోదరులు జాషువా గూటం, కె.జి.కుమార్, ఎ.విశ్వేశ్వరరావ్, బిల్ న్యూ కూంబ్ గార్లు క్లుప్త ప్రసంగములు చేసి పెదపూడి క్రీస్తు సంఘమును, సూర్యారావ్ గారిని అభినందించిరి. హాజరైనవారందరికీ చక్కటి విందు చేయబడెను.

2007 ఏప్రియల్ 28వ తేదీ శనివారం కాకినాడ వాకలపూడిలో యితరులు ఏర్పాటు చేసిన గొప్ప బహిరంగ సభలో సోదరులు రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. 500 మంది హాజరైరి. కూటం అనంతరం హాజరైన వారందరు క్రీస్తు సంఘముల వాక్యపరిచర్యను, సేవలను అభినందించిరి.

**వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్ వాల్యూమ్-9 ఇప్పుడు లభ్యమగుచున్నది. వలయు వారు సత్యవాణికి వ్రాసి ఉచితముగా పొందవచ్చును.**

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004